హైదరాబాద్ వార్త



పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యషష్ఠి పూజోత్సవాలు

చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యషష్ఠి పూజోత్సవాలు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీ ప్రసాద్, ఈవో మాచ్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఆలయం వేదపండితులు బుగ్గాలక్ష్మిపతిశర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమం జరిగింది.

## భర్త ఆచూకి కోసం పోలీసులకు భార్య ఫిర్యాదు

బేగంపేట నవంబరు 29, ప్రభాతవార్త : తన భర్త కనిపించడంలేదని, ఆచూకి తెలుసుకోవాలంటూ భార్య పోలీసులను ఆశ్రయించిన ఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట అంబేద్కర్ నగర్ కు చెందిన కె.కిరణ్ కుమార్(31) మ్యాక్సి విజన్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు.గత కొద్ది రోజులుగా ఫోన్‌లో వేరొక మహిళతో కిరణ్ కుమార్ మాట్లాడుతుండటాన్ని గమనించిన భార్య కనకతార భర్తను నిలదీసింది. అతను సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరగడంతో పాటు తన మొబైల్‌ఫోన్‌ను కూడా తన వద్దే ఉంచుకునేవాడన్నారు. మద్యానికి కూడా బానిస అయిన కిరణ్‌కుమార్ 27వ తేదీన తెల్లవారుఝామున నుంచి కనిపించకుండా పోయాడని,అతని జాడ కోసం అంతటా గాలించినా ఫలితం లేక పోవడంతో భార్య కనకతార బేగం పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమ పేరుతో యువతిపై అత్యాచారం

చార్మినార్, నవంబరు 29 ప్రభాతవార్త : ప్రేమ పేరుతో ఓ యువతిపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సన్‌సిటీ ప్రాంతానికి చెందిన మహ్మద్ అలీ ముద్దీన్ (26) అదే ప్రాంతానికి చెందిన ఇరవై ఐదు సంవత్సరాలు వయస్సు గల ఓ యువతి అమీర్‌పేట్‌లోని ఓ షాపులో పని చేస్తున్నారు. కాగా గత ఆరు నెలలుగా మహ్మద్ అలీ ముద్దీన్ బాధితురాలితో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెపై అత్యాచారం జరిపాడు. బాధితురాలు పెళ్లి విషయాన్ని నిలదీయగా మహ్మద్ అలీముద్దీన్ తప్పించుకు తిరుగుతున్నాడు. అలీ ముద్దీన్ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో తాను మోస పోయానని భావించిన బాధితురాలు మంగళవారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. మహ్మద్ అలీముద్దీన్‌పై 377 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసును రాజేం ద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరెకటికల సమగ్రాభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఆరెకటికల సమగ్రాభివృద్ధి కోసం రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆరెకటిక ఆత్మగౌరవ భవనాన్ని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, ఆరె కటికలకు బీసీ(డి) నుంచి బిసి(ఏ) హోదా కల్పిస్తూ ప్రభుత్వం వెంటనే జీవోను తీసుకురావాలని, వృత్తి భద్రత కల్పిస్తూ జీవోను కూడా తీసుకురావాలని కోరారు. నాటుసారా నిర్వాసితులకు ఆరెకటికలకు ప్రతి కుటుంబానికి రూ.2లక్షలు ఇవ్వాలని, ఆరెకటికలకు 30శాతం వైన్స్ కేటాయింపు అంశంపై ఎక్సైజ్ పాలసీలో రిజర్వేషన్ ఖచ్చితంగా కల్పించాలని, గిరిజనులు, దళితులకు రిజర్వేషన్ ఇచ్చినప్పుడు అనేక తరాల నుంచి సారాయి వ్యాపారం, మటన్ వ్యాపారం చేసినా ఆర్థికంగా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడ్డ కులం తమది అని, రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలుగా ఉన్నరు వారివారి కులాల వారీగా అభివృద్ధి చేసుకునే పాలసీలు తేవడం, దానికి మూలకారణమైన మా కులాన్ని పట్టించు కోకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో విశిష్ట అతిథులుగా బిఐసిసిఐ రాష్ట్ర అధ్యక్షుడు చేరాల నారాయణ, సంఘం గౌరవ అధ్యక్షుడు బి.కాజారాంజీ, ప్రధాన కార్యదర్శి కె.నందీశ్వర్ జీ, ఉపాధ్యక్షుడు ఎం.నాగశాస్రి, కోశాధికారి కె.శ్రీనివాస్, కె.యాదిలాల్, కె.జాంగీర్, కెడి.దినేష్, సంయుక్త కార్యదర్శి జి.బాలకిషన్, ఎస్‌కెపి.మహేందర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యకృత్యమైన దారుణాలు

సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త..

ఫేస్‌బుక్,వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ప్రభావ విస్తృతి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పెద్దలే కాదు పాఠశాల స్థాయి పిల్లలూ వీటిని వినియోగిస్తున్నారు. సమాచార మార్పిడిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మాట వాస్తవమే అయినా.. పరువు తీసే విషయంలో ఈ మాధ్యమాలు ముందుంటున్నాయి. ముఖ్యంగా అమ్మాయిలు వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. భర్తతోనో,ప్రియుడితోనో సన్నిహితంగా ఉన్నప్పుడు పొరపాటున చిత్రాలు, వీడియోలు తీసుకుంటే భవిష్యత్తులో ఆదృశ్యాలే పరువు తీసే కాలనాగులై కాటేస్తుంటాయి. సంబంధాలు బాగున్నప్పుడు పర్వాలేకున్నా..ఒక వేళ చెడిపోతే ఆదృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమై పరువు బజారుకీడుస్తున్నాయి. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో అందమైన అమ్మాయిలు కనబడితే చాలు నగ్నచిత్రాలు మార్ఫింగ్ చేసి బెదిరించే కేటుగాళ్లు ఈమధ్యకాలంలో పెరిగిపోయారు. దీనికితోడు వాట్సప్‌లకు అసభ్య సందేశాలు పంపిస్తూ వేధింపులకు గురిచేసే కేటుగాళ్లకూ కొదవలేదు. ఈనేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంలో అమ్మాయిలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది.

### కఠినచట్టాలు చేసినా ఆగని ఆకృత్యాలు
### మహిళలు, చిన్నపిల్లలపై పెరుగుతున్న వేధింపులు
### సోషల్ మీడియా వాడకంలో అప్రమత్తత అవసరం



హైదరాబాద్, నవంబర్ 29 ,ప్రభాతవార్త: మహిళలపై విద్యార్థినీలపై రోజురోజుకూ వేధింపులు పెరిగిపోతున్నాయి. ఈమెయిల్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లతో మహిళలను బెదిరిస్తున్న కేసులు కామన్ అయ్యింది. ఇప్పటివరకు వేధింపులకు గురవుతున్న బాధితుల్లో ఎక్కువశాతం సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్, కాలేజీ విద్యార్థులే ఉన్నారు. అయితే మగవారితో ఉన్న చిన్న చిన్న పరిచయాలతోనే వేధింపులకు గురవుతున్నారని పోలీసుల దర్యాప్తులో తేలుతుంది. దేశంలో ప్రతిమూడు నిమిషాలకు ఒక నేరం జరుగుతూనే ఉంది. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలు పెచ్చుమీరుతున్నాయి. మారిన సామాజిక పరిస్థితులు, స్థితిగతుల మూలంగా ఎక్కువగా అత్యాచారానికి గురయ్యే విధంగా పురిగొల్పుతున్నాయి. తండ్రి స్థాయిలో ప్రేమానురాగాలు పంచాల్సినవారే పైశాచికంగా లైంగిక దాడులకు పాల్పడమనేది ఊహించుకోలేని పరిస్థితి. ఇలాంటి వేధింపులు భరించలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా హాయత్‌నగర్ పిఎస్ పరిధిలో దారుణం జరిగింది. పదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. మధ్యాహ్న బోజనానికి ఇంటికి వెళ్ళిన బాలికను అనుసరించి ఐదుగురు నిందితులు ఇంట్లోకి చొరబడి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆఘటను సెల్‌ఫోన్ వీడియో తీసి విషయం ఎవరికైనా చెబితే దాన్ని సోషల్ మీడియాలో షేర్‌చేస్తామని బెదించారు. అలాగే రాజేంద్రనగర్ పిఎస్ పరిధిలో పెళ్లిచేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు ఒకామాంధుడు. కొగకొద్దిరోజులుగా మామాటలు చెప్పి నమ్మించి ఆమెను లొంగదీసుకుని కామవాంచ తీర్చుకున్నాడు. ఇటీవల సదరు యువకుడు కనిపించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన యువతి అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**కఠినచట్టాలు చేసినా ఆగని ఆకృత్యాలు..** ఎన్ని చట్టాలు వచ్చినా బాలికలపై లైంగిక వేధింపులు మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. కఠిన శిక్షలు, నిర్భయ చట్టాలు, పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేసినా నేరం చేయడానికి నిందితులు వెనుకాడటం లేదు. ఎందుకంటే వాటి అమలు విషయంలోని లొసుగులే వారికి ధైర్యాన్నిస్తున్నాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తప్పు చేసిన వారిలో చాలా తక్కువశాతం మందికే శిక్షపడటంతో నిందితులు బరితెగిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సమాజానికి బయపడి కొందరు,పరువు పోతుందని మరికొందరు బయటికి చెప్పుకోలేకపోతున్నారు. బాలికలపై లైంగింక దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే బాధితులకు న్యాయం జరుగుతుందని పలువురు నిపుణులు తెలుపుతున్నారు.

## కార్వాన్ గిరకపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



గిరకపల్లిలో మూసీ ఒడ్డున ఉన్నటువంటి అక్రమ నిర్మాణాలను కూల్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

మెహిదీపట్నం, నవంబర్ 29, ప్రభాతవార్త : కార్వాన్ గిరకపల్లిలోని మూసీ పరివాహకాన్ని ఆనుకొని ఉన్న దేవాదాయ శాఖకు చెందిన స్థలంలో గత ఐదు నెలల క్రితం వెలిసిన అక్రమ కట్టడాలను మంగళవారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి సయిదుద్దీన్ ఆధ్వర్యంలో ఆ కూల్చివేతలు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య జరిగాయి.పూర్తి వివరాలలోకి వెళితే కార్వాన్ గిరకపల్లిలో దేవాదాయ శాఖకు చెందిన స్థలం ఉంది. కోట్లాది రూపాయల విలువ చేసే ఈస్థలంకు ఆనుకొని గతంలో ప్రభుత్వం స్థానికంగా ఉండే రజకులు బట్టలు ఆరవేసేందుకు కేవలం 20 గుంటల భూమిని కేటాయించింది. దీనిని సాకుగా తీసుకున్న కొందరు కబ్జాదారులు తమతమ రాజకీయ పలుకుబడి ఉపయోగించి తెలంగాణ రజక అభివృద్ధి సంస్థపేరుతో దాదాపు 5 ఎకరాల స్థలంలో రేకులతో ప్రహరీ నిర్మించి స్థలాన్ని వీరి ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా దర్జాగా 500, 300 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి గజానికి దాదాపు 50వేల ధరతో విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ కబ్జా విషయమై స్థానికులు కొందరు రెవెన్యూ, దేవాదాయ శాఖలో ఫిర్యాదు చేయడంతో పాటు స్పందించిన ఇరు శాఖల అధికారులు గతంలోనే అక్రమ నిర్మాణాలను పరిశీలించి ఇక్కడ జరిగింది అక్రమ నిర్మాణాలేనని చర్యలు తప్పవని అప్పట్లోనే అధికారులు పేర్కొన్నారు. అయితే కొన్ని న్యాయపరమైన అంశాలు రావడంతో వాటిని తొలగించి చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గిరకపల్లిలో అక్రమంగా షెడ్లు నిర్మించిన వ్యక్తులకు కూల్చివేతలు తప్పవని ముందే సమాచారం ఉండడంతో రోడ్డుకు ముందరివైపు వదిలేసి వెనుకవైపు ఉన్న రేకులను, పైపులను దాదాపు తొలగించారు. కేవలం ముందు భాగంలో మిగిలిపోయిన రేకులను అధికారులు కూల్చివేసి నేలమట్టం చేశారు.

## ఓక్రిడ్జ్ స్కూల్‌కు బాంబు బెదిరింపు

### తనిఖీలు చేసి ఆకతాయి పనిగా తేల్చిన పోలీసులు

గచ్చిబౌలి, నవంబరు 29 ప్రభాతవార్త : గచ్చిబౌలి ఓక్రిడ్జ్ స్కూల్‌కు వచ్చిన ఓ బాంబు బెదిరింపు ఈ మెయిల్ మంగళవారం పోలీసులను పరుగులు పెట్టించింది. గుర్తు తెలియని ఈ మెయిల్ నుంచి బాంబు బెదిరింపు రావడంతో అప్రమత్తమైన పోలీసులు స్కూల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆకతాయి పనిగా తేల్చారు. గచ్చిబౌలి పరిధిలోని ఖాజాగూడ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు మంగళవారం ఓ గుర్తు తెలియని మెయిల్ ఐడీ నుంచి ఈ మెయిల్ వచ్చింది. పాఠశాల ఆవరణలో బాంబు పెట్టామని మెయిల్ ఉండడంతో వెంటనే స్కూల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన రాయదుర్గం పోలీసులు బాంబు స్క్వాడ్‌తో ఓక్రిడ్జ్ స్కూల్‌ను చుట్టుముట్టారు. తరగతి గదులతో పాటు పాఠశాల ఆవరణను మొత్తం క్షుణ్ణంగా తనిఖీ చేసి బాంబు లేదని నిర్ధారించారు. దీంతో ఆకతాయి చేసిన పనిగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నకిలీ మెయిల్ ఐడీ నుంచి బాంబు పెట్టామని ఈమెయిల్ పంపారని, సదరు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తు చేపడుతున్నామని రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ మహేశ్ తెలిపారు.

## సంస్కృతి స్కూల్ లిఫ్టులో పడి విద్యార్థులకు గాయాలు

### స్కూల్ మీద చర్యలు తీసుకోవాలని డిఈఓకు ఫిర్యాదు

గచ్చిబౌలి, నవంబరు 29 ప్రభాతవార్త : స్కూల్ లిఫ్టులో పడి విద్యార్థులు గాయాలపాలైనా పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించకుండా నిర్లక్ష్యంగా వహించిందని, విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న స్కూల్ యాజమాన్యం మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ క్రిస్తావా జన సమితి ఆధ్వర్యంలో మంగళవారం రంగారెడ్డి డిఈఓకు పిర్యాదు చేశారు. క్రిస్తావా జనసమితి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో గల సంస్కృతి స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న షాన్వీ ఈనెల 27వ తేదీన పాఠశాలలోని లిఫ్టులో పడిపోవడంతో కాలు విరిగిందన్నారు. షాన్వీతో పాటు మరికొందరు విద్యార్థులకు సైతం గాయాలైనా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రథమ చికిత్స సైతం చేయించకుండా తల్లిదండ్రులకు విద్యార్థులను అప్పగించారని అన్నారు. ప్రస్తుతం షాన్వీతో పాటు రాగి ప్రసాద్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంస్కృతి పాఠశాల మీద చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నెంబర్‌ప్లేటు లేకుండా తిరుగుతున్న 4 బైకులు స్వాధీనం.. కేసు నమోదు

బేగంపేట నవంబరు 29,ప్రభాతవార్త : ట్రాఫిక్ పోలీసుల కళ్లు కప్పి ఛలాన్లు లేకుండా తప్పించుకోవాలనే ఉద్దేశ్యంతో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న నాలుగు ద్విచక్ర వాహన దారులపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఈ నెల 28వ తేదీన ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బేగంపేట ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్ జి.రామకృష్ణ కానిస్టేబుల్ గణపతి,హోంగార్డు భూషన్ రావుల తో కల్సి బేగంపేట రసూల్‌పురా హాకీ గ్రౌండ్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట నుంచి గం 3ల మధ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ సమయంలో నెంబరు ప్లేటు లేకుండా ప్రయాణిస్తున్న ఫలక్‌నుమా షాహీన్ నగర్ కు చెందిన షేక్ ఉస్మాన్ టీఎస్12ఈఎస్ 2519,ఎస్సార్ నగర్ బి కే గూడా దాసారం బస్తీకి చెందిన ఎం.విజయ్‌కుమార్ కు చెందిన టీఎస్08బిఆర్‌టి5895,మేడ్చల్ జిల్లా కుతుబ్లాపూర్ జగద్గిరి గుట్ట సంజయ్ గాంధీ నగర్ కు చెందిన సయ్యద్ ఒమెర్ టీఎస్08 జిఎస్6511,ఎర్రగడ్డ సుల్తాన్ నగర్ కు చెందిన మహ్మద్ కరీమ్ టీఎస్08ఎఫ్‌డబ్ల్యూ8878 రిజిస్ట్రేషన్ నెంబర్లు లేకుండా ప్రయాణిస్తూ ట్రాఫిక్ పోలీసులను మోసం చేస్తున్నారంటూ పోలీసులు కేసు నమోదు చేసారు.హాకీ గ్రౌండ్ రసూల్‌పురా వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్సై జి.రామ కృష్ణ ఫిర్యాదు మేరకు బేగంపేట ఎస్సై పి.ప్రమోద్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీ

బేగంపేట నవంబరు 29, ప్రభాతవార్త : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ వెంట్‌లో పాల్గొనేందుకు వచ్చి ఓ యువకుడు తన మోటారు సైకిల్‌ను ఎప్పటి లాగానే స్విమ్మింగ్ పూల్ బస్టాప్ వద్ద పార్కింగ్ చేసాడు.ఈవెంట్ లో పాల్గొన్న అనంతరం వచ్చి చూస్తే తన బైకు కనిపించలేదు.ఈ ఘటన మహంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సుచిత్రా పద్మానగర్ ఫేజ్2 వినాయక రెసిడెన్సీలో నివాసం ఉండే విద్యార్థి రమావత్ రమేష్ ఈ నెల 24వ తేదీన తన ఇంటి నుంచి బయలు దేరి వచ్చాడు.సికి ంద్రాబాద్ పరిధిలోని ఎస్‌బిఐ ఫ్లై ఓవర్ స్విమ్మింగ్ ఫూల్ బస్టాప్ వద్ద తన టీఎస్08ఈబి 2908 మోటారు సైకిల్‌ను పార్కింగ్ చేసాడు.అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసేందుకు గం 6.15నిమిషాలకు వెళ్లాడు.గం 7.10నిలకు వచ్చి చూస్తే అతని మోటారు సైకిల్ తను పార్కింగ్ చేసిన ప్రాంతంలో కనిపించలేదు.నెలన్నర రోజులుగా అతను పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈవెంట్‌లో పాల్గొనేందుకు వస్తున్నాడన్నారు.బైకు కోసం సమీపంలోని అన్ని ప్రాంతాల్లో గాలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.ఈ నెల 28వ తేదీన రమావత్ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి : మంత్రి తలసాని



సుబ్రమణ్య షష్ఠి వేడుకల్లో పూజలు చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాత వార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయంలో నిర్వహించిన షష్ఠి,శ్రీవల్లి దేవసేన పూజా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజిస్తే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సి.సంతోష్ యా దవ్, ఈఓ సుధాకర్, ఆలయ ధర్మకర్తలు చొల్లేటి రమేశ్, మోండా డివిజన్ టిఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, ధర్మకర్తలు పద్మజా, నర్సింహ్మా, భువనేశ్వరీ పాల్గొన్నారు. దాతల సహకారంతో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రౌండ్ ఫ్లెస్-1 దేవాలయ భవన నిర్మాణానికి సహకరించిన చైర్మన్ సంతోష్ యాదవ్‌ను మంత్రి తలసాని అభినందించారు.

## అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

### విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి



సమావేశంలో ప్రసంగిస్తున్న లింబాద్రి, నారాయణ, చక్రపాణి

సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త: ప్రపంచ మేధావి, భారత రత్న డా.బి.ఆర్.అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం లాంటిది మరెక్కడ లేదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ రాజ్యాంగం చాలా ప్రమాదంలో పడిందని, దీన్ని అందరు కలిసి కాపాడుకోవాలని సూచించారు. 73వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర దిశ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన 'అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి పురస్కారాలు-2022' ప్రదానోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. అంటరానితనం నిర్మూలన, అస్పృస్యత నివారణ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందరికి లభించేలా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. రాజ్యాంగంలో విద్యా హక్కు చట్టాన్ని పొందుపరచడం ద్వారానే నేడు అనేక మంది మహిళలు సైతం విద్యను అభ్యసిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ప్రసంగిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ విషపు విధానాలు రాజ్యాంగంపై దాడికి సిద్ధమైనాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా కనుసన్నల్లోనే విచ్ఛిన్నకర విధానాలు అమలు జరుగుతున్నాయని, దేశాన్ని చీల్చే కుట్ర జరుగుతున్నదని ఆయన ధ్వజమెత్తారు. బిజెపి కొత్త రాజ్యాంగం గురించి ఆలోచిస్తున్నదని ఆదే మనుస్మృతి అని, దీని మూలాలు నాగపూర్‌లో ఉన్నాయని ఆరోపించారు. దేశ సంపద కార్పోరేట్ శక్తులైన అంబాని, అదానీల చేతుల్లో పెద్ద ఎత్తున ఉందని వాళ్ళ కోసమే ప్రభుత్వాలు వస్తున్నాయని ధ్వజమెత్తారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళెందుకు అందరు కృషి చేయాలని అల్లం నారాయణ పిలుపునిచ్చారు. టిఎస్‌పిఎస్‌సి మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అంబేద్కర్‌ను యావత్ ప్రపంచం గుర్తించిందన్నారు. అంబేద్కర్ గొప్ప ప్రజ్ఞాశాలి అని ఆయన మార్గమే తమ మార్గమని ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే తనకు ప్రధాన మంత్రి పదవి దక్కిందని ప్రకటించిన నరేంద్రమోదీ గత ఐదారేళ్ళ నుంచి అంబేద్కర్ గురించి పెద్దగా ప్రస్తావించడం లేదన్నారు. ఈ సభలో రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ డా.ఎర్రోళ్ళ శ్రీనివాస్, సామాజిక కార్యకర్త మారోజు దిశ, ప్రముఖ వైద్యురాలు అనురాధ, దిశ సేవా సంస్థ ప్రతినిధులు డా.గొల్లబోయిన అంబేద్కర్, బండారు రాజు తదితరులు పాల్గొన్నారు.

## భారత విప్లవోద్యమంలో చిరస్మరణీయంగా నిలిచిన వ్యక్తి చంద్రపుల్లారెడ్డి

చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త: భారత విప్లవోద్యమంలో చిరస్మరణీయంగా నిలిచిన వ్యక్తి చంద్రపుల్లారెడ్డి అని సిపిఐ(ఎంఎల్)రాంచంద్రన్ పార్టీ అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చంద్రపుల్లారెడ్డి 38వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా నవంబరు 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సంస్మరణ సభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బొమ్మకంటి సిద్ధిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు పడిశాల భాస్కర్, రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు చిట్టిబాబు, సిపిఐ(ఎంఎల్) ప్రతిఘటన కేంద్ర కమిటటీ కార్యదర్శి షేక్ షావలి, ఎఐఎఫ్‌టటియు రాష్ట్ర కన్వీనర్ భూపతి రాజలింగం, బీడీ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ గంగాధర్, దక్షిణభారత దేశ భారతదేశ రాజకీయ వ్యవస్థాపక అధ్యక్షుడు రషీద్ పాల్గొని ప్రసంగించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ తెలంగాణ ఆదివాసులకు, దళిత, బహుజనులకు ఎన్నో హామీలు ఇచ్చారని,వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీ గిరిజన, గిరిజనేతల ప్రజలకు పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా దాడులు, దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## చిలుకలగూడ క్రాస్ రోడ్డులో సివరేజ్‌లైన్ పనులతో ట్రాఫిక్ మళ్లింపు

### డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



చిలుకలగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, చిత్రంలో కార్పోరేటర్లు రాసూరి సునిత

మెట్టుగూడ, నవంబర్ 29 ప్రభాతవార్త: మెట్టుగూడ డివిజన్ పరిధిలోని చిలుకలగూడ క్రాస్ రోడ్డులో సివరేజ్‌లైన్ పనుల వల్ల ట్రాఫిక్ మళ్లించాల్సి వస్తుందని ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ విజ్ఞప్తి చేశారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలోని సింద్రాబాద్ రైల్వే కాలనీల వద్ద సెవరేజ్ సమస్యలను నివారించేందుకు రూ. 25లక్షల వ్యయంతో నూతన పైపు లైన్ నిర్మాణం పనులకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ స్థానిక కార్పోరేటర్ రాసూరి సునితతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పైపులైన్ పనులకారణంగా ట్రాఫిక్‌ను మళ్లించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. వారం రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఏసీపీ గంగిరెడ్డి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ భరత్‌కుమార్ తధితరులతో పద్మారావుగౌడ్ చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సితాఫల్ మండి కార్పోరేటర్ సామల హేమ, వాటర్ వర్క్స్ జీఎం రమణారెడ్డి, తెరాస యువ నేత కిషోర్ గౌడ్, డీజీఎం వై.కృష్ణ, మేనేజర్ హాఖీం,టీఆర్‌ఎస్ నాయకులు వంజరి సతీష్, జగదీష్, విజయ్‌కుమార్, గోపాల్ నాయక్, నరేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# భగవంతుడి ముందు అంతా సమానమే

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**


కమిటీ సభ్యులు, అర్చకులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 29, ప్రభాతవార్త : భగవంతుడి ముందు అంతా సమానమేనని, భక్తులను ఇబ్బందులకు గురి చేయవద్దని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుకలు కావాల్సిన సౌకర్యాలను ప్రభుత్వం, దాతల సహకారంతో కల్పిస్తున్నట్లు చెప్పారు. భక్తుల ఆలయ అర్చకులు కొందరు వ్యవహరిస్తున్న తీరుపై మంత్రికి స్థానికులు కొందరు పిర్యాదు చేయగా, అలా వ్యవహరించే వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఫిర్యాదులపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని దేవాదాయశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. పద్దతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఆలయాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని, స్థానికులు కూడా అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ విశిష్టతను మరింత పెంపొందించే విధంగా త్వరలో ఆర్చీల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, దేవాదాయశాఖ డిప్యూటీ కమీషనర్ రామకృష్ణ, అసెస్టెంట్ కమీషనర్ కృష్ణ, అర్చకులు, కమిటీ సభ్యులు, బి.బాల్‌రాజ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే సాయన్న


45లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సుబ్రమణ్య స్వామి కార్యాలయం, మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త: వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయంలో 45లక్షల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కార్యాలయం, మినీ ఫంక్షన్ హాల్‌ను మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, మల్కాజిగిరి పార్లమెంట్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయన్న మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తే మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. అందు వల్ల ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు ఆలయాల అభివృద్ధికి దాతలు ముందకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాసస్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, భానుక నర్మధ మల్లికార్జున్, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, ఆలయ చైర్మన్ సి.సంతోష్ యాదవ్, ఆలయ ఈఓ జి.సుధాకర్, ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, టిఆర్ఎస్ నాయకులు పిట్ల నాగేశ్, సదానంద్ గౌడ్, నాగినేని సరిత, పద్మజా, నర్సింహ్మా, భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే కార్యకర్తలకు పదవులు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


వెంకట్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి, గౌతమ్‌రావు

హైదరాబాద్, నంబర్ 29,ప్రభాతవార్త: స్థాని క ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా ప్రజాసేవ చేసే కార్యకర్తలకు పదవులు వాటిఅంతట అవే వస్తాయని కేంద్రపర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ డిడికాలనీలోని పల్లె వెంకట్‌గౌడ్ బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఇండస్ట్రియల్ సెల్ కన్వీనర్‌గా ఎంపిక కావడాన్ని పురస్కరించుకుని కిషన్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తన సన్మానాన్ని పురస్కరించుకుని డిడికాలనీలో విలేకరులతో వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేసూనత ప్రజల విశ్వాసాన్ని పొందుతానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అంబర్‌పేట్‌లో బిజెపి అభ్యర్థి విజయానికి సైనుకునిలాగా పనిచేసూనత గెలిపిసానతమనని ఆయన హామీ ఇచ్చారు. తన పదవికి సహాయ సహకారాలు అందించిన గ్రేటరన అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ బి.పద్మ, బిజెపి జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌ఛార్జ్ బి.వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నేత పి.గోవర్ధన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


## నిర్విరామంగా 12 గంటల పాటు కళా ప్రదర్శనలు

సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:కళలకు, కళాకారులకు చేయూత నివ్వవలిసిన అవసరం ఉందని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ప్రజలను చైతన్య పరిచే గొప్ప సాధనాలు కళలు అని చెప్పారు. తెలంగాణ పెర్ఫార్మింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రవింద్రభారతి ఆడిటోరియంలో సకల కళావైభవం పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. గౌరవ అతిధిగా తెలంగాణ టూరిజం కార్పోరేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆత్మీయ అతిధి ఎంఎన్ శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు గుండె బాబురావు, ఉపాధ్యక్షుడు ఆర్.నాగేంద్రనాయక్, ఎం.శ్రీహరి, కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి మనోహర్, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభుచరణ్, రాజలింగం, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొని 12 గంటల పాటు నిర్విరామ ఏకదాటిగా సకల కళా ప్రదర్శనలు చేసి పాటలు పాడి అలరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కళలను నమ్ముకుని కళలపై ఆధారపడి జీవిస్తున్న కళాకారులకు తమ అసోసియేషన్ కష్టకాలంలో చేయూత నిస్తున్నదని వెల్లడించారు. సాహిత్య కళాకారులు నాట్యం, ఇంద్రజాలం, మిమిక్రి, యక్షగానం, బుర్రకథ తదితర కళారూపాలకు చెందిన కళాకారులకు తమ సంస్థ వెన్నంటే ఉంటుందని వారు వివరించారు. దాతల సౌజన్యంతో కళాకారులకు కష్టకాలంలో ఆర్థికంగా అదుకుంటున్నామన్నారు.

## అయ్యప్ప శరణుఘోషతో మారుమ్రోగిన రామ్‌నగర్

చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త: అయ్యప్ప శరణుఘోషతో రామ్‌నగర్ ప్రాంతం మారుమ్రోగింది. రామ్‌నగర్ శివాలయం ఆవరణంలో అయ్యప్ప సేవా సమితి నిర్వాహకులు కె.విజయానంద్(నందు గురుస్వామి) 30వ అయ్యస్వామి మహాపడి పూజా మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. అలంకార బ్రహ్మశ్రీ ఆత్రేయ ఆచార్యులచే ఈ పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గంగపుత్ర నర్సింగరావు బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప భజన కార్యక్రమం అందరిని ఆధ్యాత్మికసాగరంలో తేలియాడించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా హంపి శ్రీ వీరుపాక్షా విద్యారణ్య మహాసంస్థానం జగద్గురు శంకరాచార్యులు విద్యారణ్యభారతిస్వామి హాజరై అణుగ్రహ భాషణం చేశారు. మరో ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణవంశీ స్వామి, సన్నిధానం స్వాములు కె.కాశీనాథ్, జి.అశోక్, ఎం.శివ, జి.పునీత్, కె.నరేశ్, ఎం.సాగర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట అభివృద్ధికి నిరంతరం కృషి : లింగాని ప్రసన్న


అడ్డగుట్టలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట,నవంబర్ 29 ప్రభాతవార్త: డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సహాయ సహకారాలతో అడ్డగుట్ట డివిజన్ అబివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అడ్డగుట్ట సి-సెక్షన్‌లో లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులను అమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు సత్తయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పొన్నాల రాజు, అమర్, గౌసస్, మల్లేశ్, అయోధ్య,ఇస్మయిల్, రవి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభకనబర్చాలి : జంపనప్రతాప్**

క్రికెట్ క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తు కోసం యువత ప్రతిభకనబర్చాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడుజంపనప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ బోయిన్‌పల్లి పెన ్షన్‌లైన్ ప్రాంతానికి చెందిన అబు భాకర్ సిద్దికి గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగే అండర్ -16 విజయ్ మర్చెంట్ ట్రోఫీకి ఎంపికైనందుకు మంగళవారం ఆ క్రీడాకారున్ని జంపనప్రతాప్ శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కీపర్‌కమ్ బ్యాట్ ్స్మెన్‌గా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్, షకీబ్,మౌలా, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

## కుట్రతోనే సస్పెండ్ చేశారు : బిషప్ సాల్మాన్ రాజు

కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త: డయాసిస్‌లో వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్న రెవరెండ్ భాస్కర్, కోశాధికారి డేనియల్ సువర్ణరావ్‌లు కలిసి కుట్రా కుతంత్రాలతో తనను సస్పెండ్ చేశారని బిషప్ సాల్మాన్ రాజు ఆరోపించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని మెదక్ డయాసిసిస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినాడ్ కోర్టులో ఈ నెల 28న విచారణ జరిపి మంగళవారం సాల్మాన్ రాజును సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చారని, అది పూర్తిగా అ ప్రజాస్వామికమని తెలిపారు. తనకు షోకాజ్ నోటీలు ఇవ్వకుండా తనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదన్నారు. ఇటీవల అధ్యక్ష మండలంలో రూ.35 లక్షల విలువ చేసే స్థలంపై తాము అడ్డుపడినందుకు ఈ కుట్రపన్ని తనను సస్పెండ్ చేశారన్నారు. ఈ విషయంపై ఇరు వర్గాలు గోపాలపురం పోలీసులను ఆశ్రయించడంతో ఇరు వర్గాలకు కౌని ్సలింగ్ ఇచ్చారని తెలిపారు.

## నాయి బ్రాహ్మణుల ధర్నా



అల్వాల్, నవంబరు 29 ప్రభాతవార్త: కార్పొరేటర్ సంస్థలు ఇతర కులస్తులు క్షవర వృత్తిని చేపడుతుండడాన్ని నిరసిస్తూ మంగళవారం నాయి బ్రాహ్మణులు ధర్నా చేయడం జరిగింది. అల్వాల్ కంటోన్మెంట్ ప్రాంతాలకు చెందిన నాయి బ్రాహ్మ ణులు ఓల్డ్ అల్వాల్‌లో నెలకొల్పుతున్న కార్పొరేటర్ క్షవర కేంద్రం వద్ద నిరసనలో పాల్గొన్నారు. నాయి బ్రాహ్మణులు మాత్రమే క్షవర వృత్తిని చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను తీసుకుని రావాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలు క్షవర వృత్తిలోకి రావడంతో తమ జీవనోపాధికి ఇప్పటికే చాలా వరకు గండి పడిందని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. దశాబ్దాలు కాలంగా ఇదే వృత్తిపై ఆదారపడి జీవనం సాగిస్తున్న తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విష్ణు శ్యామ్‌రావు అశ్విన్ సఉమాన్ జాన్‌పాల్ రాజు శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1నుంచి 4 వరకు మేడారం మిని జాతర

సికింద్రాబాద్, నవంబర్ 29 ప్రభాతవార్త : వచ్చేనెల మేడారం సమ్మక్క సారలమ్మ మిని జాతర నిర్వహించడం కోసం ఏర్పాట్లు జరుపుతున్నట్లు సమ్మక్క సారలమ్మ మాజీ డైరెక్టర్, టీఆర్ఎస్ నాయకుడు పోల్ సంజీవి ముదిరాజ్ తెలిపారు. మేడారం దేవస్థానం అవరణలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈఓ కార్యాలయంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయినన జగ్గారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాతర తేదీలు, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించినట్లు చెప్పారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 1 బుధవారం నుంచి ఫిబ్రవరి 4 శనివారం వరకు అంతర్గత పూజలు, మిని జాతర నిర్వహించేందుకు తీర్మానించినట్లు సంజీవి ముదిరాజ్ పేర్కొన్నారు.

## బిసి జనగణన చేపట్టాలని ధర్నా

సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త: బిసి కులాల జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రీయ పిచడా వర్గ్ మోర్చా (నేషనల్ బిసి మోర్చా) ఆధ్వర్యంలో మంగళవారం భారత్ బందలో భాగంగా మోర్చా కార్యకర్తలు ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోర్చ నాయకుడు అసోల్ లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే బిసి జనాభా లెక్కలను చేట్టాలని డిమాండ్ చేశారు. లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్‌రామ్‌నాయక్ మాట్లాడుతూ దేశంలో ఇవిఎంలను రద్దు చేయాలని కోరారు. నరేందర్ మాట్లాడుతూ బహుజన ముక్తి పార్టీ జాతీయ స్థాయిలో బిసి గణన కోసం ఉద్యమిస్తున్నదని చెప్పారు. భారతీయ విద్యార్థి మోర్చా నాయకుడు బట్టు శ్రీధర్ మాట్లాడుతూ ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లు రాజ్యాంగ విరుద్ధమని, వంద శాతం జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రవీంద్రమాలి, డా.కుమార్, గౌస్, ఖాజారియజుదుద్దీన్, సురేందర్‌సింగ్, ప్రొఫెసర్ ధర్మయ్య, ప్రభాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో కూడిన అభివృద్ధికి ప్రాధాన్యత

**కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, నవంబరు 29 ప్రభాతవార్త: నాణ్యతతో కూడిన అభివృద్ధి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రాజీవ్ వీకర్ సెక్షన్‌లో 30లక్షలు వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించడం జరిగింది. నియమ నిబంధనలకు అనుగుణంగానే కాంట్రాక్టర్ పని చేసే విధంగా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే అని తెలిపారు. ప్రజలు కట్టిన పన్నులు ద్వారానే అభివృద్ధి జరుగుతుందనేది గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణ పనులకు బస్తీ వాసలు సహకరించాలని ఆమె కోరారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాయ సహకారాలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు అరవింద్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి

చార్మినార్,నవంబరు 29 ప్రభాతవార్త : టిపిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డిని మంగళవారం ఘాన్సీ బజార్‌కు చెందిన టిపిసిసి కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురుషోత్తమ్, రమేష్, పలువురు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

చిక్కడపల్లి,నవంబరు 29 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న నూతన సీవరేజ్, మంచినీటి పైప్‌లైన్ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ వాటర్‌బోర్డు జీఎం శ్రీధర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియలో జాప్యం ఎందుకు చేస్తున్నారని కార్పొరేటర్ ప్రశ్నించారు. మంగళవారం వాటర్‌బోర్డు జీఎం శ్రీధర్ రెడ్డిని కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. డివిజన్‌లో పలుచోట్ల నెల కొన్న లోప్రెషర్ సమస్యను పరిష్కరించే దిశగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## పార్క్ అభివృద్ధి పనులు వేగవంతం


పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్ గౌడ్‌లు

సికింద్రాబాద్, నవంబర్ 29 ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని పద్మారావు నగర్‌లో గల వెంకటాపురం పార్క్ అభివృద్ధి పనులను అధికారులు వేగవంతం చేశారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ హేమలత, పద్మా రావునగర్ టీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్‌లు పార్క్‌లో జరుగుతున్న అభివృ ద్ధి పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 24 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో వాకింగ్ ట్రాక్, బోర్‌వెల్, పార్కును సందర్శించేవారు కూర్చుడానికి అవసరమైన గాజోబి నిర్మాణం, గ్రీన్‌లాన్, ఆయుర్వేద మొక్కల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15న పార్క్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభిస్తారని చెప్పారు. మంత్రి తలసాని ఆదేశాల మేరకు కేవలం 24 గంటల్లోనే జీహెచ్ఎంసీ సిబ్బది వీధి కుక్కలను తరలించినట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో హర్టికల్చర్ అధికారి రాఘవేందర్, ఏఈ నవీన్, టౌన్‌ప్లానింగ్ అధికారి జగదీష్ అతర అధికారులు నేతలు పాల్గొన్నారు.

## ఆంధ్ర నాట్యానికి ఆద్యుడు నటరాజ రామకృష్ణ

**ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి**

సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త: ఆంధ్ర నాట్యానికి ఆద్యుడు నటరాజ రామకృష్ణ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి కొనియాడారు. కళా ప్రపూర్ణ స్వర్గీయ నటరాజరామకృష్ణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నృత్య గురువు కళా కృష్ణ నిర్వహణలో ప్రొఫెసర్ భాగవతుల సీతారాం, డా.సజనీ వల్లభనేని ఆంధ్ర నాట్య ఆగమ పారిజాత అంశాల ప్రదర్శన కూచిపూడి నృత్యనిలయం, శ్రీకీర్తి నృత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిధాగా పాల్గొన్న రమణాచారి మాట్లాడుతూ నటరాజ రామకృష్ణ శత జయంతి ఉత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ దీపికారెడ్డి, పరిశోధకులు గంధం బసవ శంకరరావు, ప్రముఖ కూచిపూడి నృత్య గురువులు సరళకుమారి, డా. రమాదేవి, డా.వనజఉదయ్, జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, తారా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రారావును తక్షణమే విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం లక్ష్మణ్

సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త: ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అనం చంద్రారావును తక్షణమే పోలీసులు విడుదల చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు డిమాండ్ చేశారు. పది రోజుల క్రితం బాగ్‌లిం గంపల్లిలో ఒక బహిరంగ సభకు హాజరైన చంద్రారావు అకస్మాత్తుగా మాయమైనారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రా రావుపై ఏమైన కేసులు ఉంటే కోర్టులో హాజరుపరచాలని, లేని పక్షంలో బేషరుతుగా విడుదల చేయాలని కోరారు. గతంలో ఆయనను పోలీసులు అరెస్టు చేసి విడుదల చేయడం జరిగిందని చెప్పారు. చంద్రారావుకు ఏదైన ప్రమాదం జరిగితే రాష్ట్ర ప్రభు త్వమే బాధ్యత వహించవలిసి వస్తుందని హెచ్చరిం చారు. చంద్రారావు విషయంలో రాష్ట్ర మానవ హక్కు ల సంఘం సుమోటగా కేసును తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని వారు విజ్ఞప్తి చేశారు.

**దీక్షా దివాస్‌లో ఎమ్మెల్యే సాయన్న**

కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త: దీక్షా దివాస్‌ను పురస్కరించుకొని మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యులు ప్రభాకర్, టిఆర్ఎస్ నాయకులు నివేదిత, నాగినేని సరిత, పనస సంతోష్, పిట్ల నాగేశ్, సదానంద్ గౌడ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ శ్రీదేవికి ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

**మూడురోజుల్లో స్పందించకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తాం.. జాతీయ యాదవహక్కుల పోరాట సమితి**


సమావేశంలో మాట్లాడుతున్న రాములు యాదవ్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త: చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిపై ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ఆమెకు బహిరంగ క్షమాపణ చెప్పాలని యాదవ్ హక్కుల పోరాటసమితి డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ మాట్లాడుతూ సోమవారం చర్లపల్లి డివిజన్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి సమాచారం ఇవ్వకుండా నిర్వహించారని దీనిపై ప్రశ్నించినందుకు ఆమెను కులంపేరుతో దూషించారని మండి డ్డారు. ఎమ్మెల్యేకు మూడురోజుల సమయం ఇస్తున్నామని వెంటనే క్షమాపణ చెప్పకపోతే ఆయన ఇంటిని ముట్టడించి యాదవుల సత్తాఏంటో చూపుతామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారగోని శ్రీనివాస్‌యాదవ్, గ్రేటర్ అధ్యక్షులు గంగబోయిన రవికుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, ఐలేష్‌యాదవ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే ముఠాగోపాల్


కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టినిసారిస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఇందులో భాగంగానే కోట్లాది రూపాయల వ్యయంతో నూతన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్ నిర్మించడం జరిగిందని అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతినగర్‌లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడానికి బస్తీ పర్యటన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, గుండు జగదీశ్, మారిశెట్టి నర్సింగరావు, రవిశంకర్‌గుప్త, పున్న సత్యనారాయణ, పోతుల శ్రీకాంత్, హెచ్.హనుమంతు, బి.కిరణ్‌కుమార్, పిఎస్.శ్రీనివాస్, వై.లక్ష్మయ్య, నర్సింగ్‌మూదిరాజ్, మహ్మద్ యాసీన్, టి.యాదగిరి, ఎస్టీ.ప్రేమ్, మహబూబ్, శ్రీను, చందు తదితరులు పాల్గొన్నారు.

**రూ.13లక్షలతో డ్రైనేజీ అభివృద్ధిపనులు ప్రారంభం**


రామ్‌నగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రూ.13లక్షలతో నిర్మించతలపెట్టిన డ్రైనేజీ అభివృద్ధి నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ రవిచారితో కలిసి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ లాంఛనంగా ప్రారంభించారు. రూ.7లక్షలతో అబ్బాసాయి అపార్ట్‌మెంట్ నుంచి హరినగర్ వరకు, అదే విధంగా రూ.6లక్షలతో ఎస్సార్టీ నుంచి అబ్బాసాయి అపార్ట్‌మెంట్ వరకు డ్రైనేజీ అభివృద్ధి పనులను ప్రారంభించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రవిచారి వివరించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌బోర్డు డిజిఎం దిలీప్‌కుమార్, బిజెపి నేతలు గడ్డం నవీన్‌కుమార్, రాకేశ్, టిఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో దాగియున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్సు ప్రదర్శనలు దోహదం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ పులి రవికుమార్,జిల్లా సైన్సు అధికారి ధర్మేందర్‌రావు,పలువురు విద్యాశాఖాధికారులు

చార్మినార్, నవంబరు 29 ప్రభాతవార్త : విద్యార్దులలో దాగియున్న సృజన్మాకతను వెలికి తీసేందుకు సైన్సు ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని వరంగల్ నిట్ ప్రొఫెసర్, మాజీ సభ్యులు కార్యదర్శి టిఎస్ కాస్ట్ పులి రవికుమార్ అన్నారు.హైదరాబాద్ పాతబస్తీ అలీజాకోట్లలోని పోలారిస్ ఇంట్రాక్టివిట్ హైస్కూల్‌లో మంగళవారం టిఎస్ కాస్ట్ ఆధ్వర యంలో జరిగిన 30వ ఎన్‌సిఎస్‌సి హైదరాబాద్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాలల విద్యార్దులకు ఆయన మెమొంటోల తో పాటు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు ప్రాజెక్టులు విద్యార్దులు తమ యొక్క విజ్ఞాన ప్రతిభను నిరూపించుకునేందుకు అన్ని విధాల ఉపయోగ పడతాయని తెలిపారు.కాగా అంబర్‌పేట్ జిబిహెచ్ఎస్ హైస్కూల్,బేగం పేట్ రెండు ప్రభుత్వ అంధుల పాఠశాల,బేగం పేట్ జిహెచ్ఎస్,పోలార్ ఇంట్రాక్టివిట్ హైస్కూల్,చాంద్రాయణగుట్ట జిహెచ్ఎస్‌లు రాష్ట్ర స్థాయి 30వ ఎన్‌సిఎస్‌సికు ఎంపికయ్యాయి.ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్. మొహియుద్దీన్ షరీప్,జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి,డిప్యూటీ డిఇఓ బహదూర్‌పుర సయ్యద్ ఖాజా ముక్రం, జిల్లా సైన్సు అధికారి సి.ధర్మేందర్ రావు,పోలారిస్ ఇంట్రాక్టివిట్ స్కూల్ చైర్మన్ ఖాలీద్ మహ్మద్ బాజాబర్, కర స్పాండెంట్ అబ్దుల్ మాలిక్ బాజాబర్, డాక్టర్ విజయ్ భాస్కర్‌లు పాల్గొన్నారు.

## ఓటరు నమోదును విస్తృతంగా చేపట్టాలి


ప్రసంగిస్తున్న జిహెచ్ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమీషనర్ హరికృష్ణ

చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త: నకిలీ ఓట్లను అరికట్టడం, బోగస్ ఓటర్ ఐడీలను ఏరివేస్తూ పారదర్శకంగా ఓటర్ల జాబితాల రూపొందించాలనే ఉద్దేశ్యంతో ఓటర్ల జాబితాను ఆధార్ నెంబర్లతో లింక్ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయబోతున్నట్టు జిహెచ్ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమీషనర్ హరికృష్ణ అన్నారు. మంగళవారం జిహెచ్ఎంసి సర్కిల్-15 కార్యాలయంలో ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాలు దిద్దుబాటు, అడ్రెస్ మూర్పు, ఓటింగ్ శాతాన్ని పెంచడం తదితర అంశాలపై ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులతో సమావేశం జరిగింది. మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ బి.వెంకటస్వామిగౌడ్, ఎంఐఎం నేత అజీజుల్లా ఖాన్, టిఆర్ఎస్ సీనియర్ నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, మాధవ్, ఎండి.ఆలీ, శంకర్‌గౌడ్, బిజెపి నేతలు రమేశ్ రామ్ తదితరులు పాల్గొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆధార్‌లింక్ చేసుకునేందుకు దోమలగూడ, అశోక్‌నగర్ ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటరు జాబితాలో తప్పులున్నా వెంటనే సరిదిద్దుకునే అవకాశం కూడా ఉందని, 18 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. వివిధ పార్టీల నేతలు కూడా ప్రజల్లో ఈ విషయంలో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తమతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి సూపరింటెండెంట్‌లు నర్సయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచడానికి చెత్తను ఏరివేతకు ఉపయోగిస్తున్న వాహనాలకు మైకును ఏర్పాటు చేసి ప్రచారాన్ని చేపడితే కొంత సత్ఫలితాలు లభించే అవకాశం ఉంటుందని సిపిఐ నేత వెంకటస్వామి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన నిపునిత,స్ఫూర్తి,చిత్రంలో కోచ్‌లు శ్రీనివాస్,సంతోష్ చారి

కంటోన్మెంట్,నవంబర్ 29 ప్రభాతవార్త: సికింద్రాబాద్‌లోని జిహెచ్ఎంసి స్విమ్మింగ్‌ఫూల్‌లో ఈ నెల 27,28 తేదీల్లో 7వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ 2022 పోటీలు జరిగాయి. అబిడ్స్‌లోని రోజరి కార్మెంట్ హై స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పబ్బ నిపునిత,స్ఫూర్తిలు విజయం సాధించి 3 గోల్డ్‌మెడల్స్, 1సిల్వర్, బ్రౌన్స్‌లతో కలిపి 5 మెడల్స్ సాధించారు. జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించిన నిపునిత,స్ఫూర్తిలు జాతీయ స్థాయిలో జరిగే స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బజరంగ్ శర్మ, కార్యదర్శి రామక్రిష్ణలు తెలిపారు. ఆర్టీసి కంటోన్మెంట్ డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న పబ్బ శ్రీనివాస్ కుమార్తె నిపునిత జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు విజయం సాధించినందుకు నిపుని తను, వారి తల్లిదండ్రులను ఆర్టీసి ఉద్యోగులు అభినందించారు.

## తార్నాకలో ఘనంగా దీక్షాదివస్



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, నవంబర్ 29 ప్రభాతవార్త: దీక్షాదివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని తార్నాక డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం ముందు సీఎం కేసీఆర్ చిత్రపటానికి నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాలాభిశేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 29రోజు చారిత్రక రోజు అన్నారు. రాష్ట్రం ఏర్పాటుకు పునాదిపడిన రోజు అన్నారు. మలిదశ ఉద్యమంలో భాగంగా తెలంగాణ వచ్చుడో కేసీఆర్ చచ్చుడో అనే నినాదంతో సీఎం కేసీఆర్ చేపట్టిన రోజు దీక్షాదివస్ అన్నారు.తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సీఎం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి దిక్షదివస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణలో రౌడీరాజ్యం కొనసాగుతుంది



రామాగౌడ్‌ను లాక్కెళ్తున్న పోలీసులు

నిజాంపేట్,నవంబర్29 ప్రభాతవార్త: తెలంగాణలో రౌడీ రాజ్యం కొనసాగుతోందని కుత్బుల్లాపూర్ వైఎస్ఆర్‌టీపి కో-ఆర్డినేటర్ రామాగౌడ్ ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కార్యకర్తలతో మంగళవారం రామాగౌడ్ ప్రగతి భవన్ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రామాగౌడ్ మాట్లాడుతూ నర్సంపేటలో పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ పాదయాత్రలో టీఆర్ఎస్ కార్యకర్తలు కాన్వాయ్‌పై దాడి చేయడం సిగ్గుచేట న్నారు. అంతేకాకుండా ప్రగతి భవన్‌కు చేరుకుంటు న్న షర్మిళను తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడం కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనమన్నారు. ఈ ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమంలో నాని, నవీన్, ప్రదీప్‌రెడ్డి, డానియేల్, అర్జున్‌రెడ్డి, రాజ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకృతి ఫౌండేషన్‌కు వైశ్య లైమ్‌లైట్స్ అవార్డు

నిజాంపేట్,నవంబర్29 ప్రభాతవార్త: హైదరాబాద్ ఫిలింనగర్ లోని జెరసి కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన వైశ్య లైమ్‌లైట్స్ అ వార్డుల్లో ఆకృతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ గ్రంధిశిల రాగశైలజ 14వ స్థానంలో నిలిచింది.ఈ అవార్డును రాగశైలజ తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, మానేపల్లి జ్యువెల్లర్స్ అధినేత రామారావు,మోటివేషన్ స్పీకర్ గంప నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు.ఈ కార్యమ్రంలో ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ శివకుమార్, నిజామాబాద్ ఎమ్మెల్యే బిగ్గల గణేష్ గుప్తా, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ గుప్తా, కృష్ణారావు, సంతప్,మల్లిఖార్జున్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా నిలుస్తుంది



బాస్ సేవలు బేష్ జాయింట్ కమిషనర్ పోలీసు గజారావు భూపాల్

అప్జల్‌గంజ్, నవంబర్ 29 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం వైద్యా, ఆరోగ్య శాఖను మరింత బలోపేతం చేస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తుందని జాయింట్ సిపి గజరావుభూపాల్ అన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో బాస్,హెల్ప్ఎనీడి సంస్థ,వీషాల్ ఓవర్ స్వచ్ఛంద సంస్థల ఆద్వర్యంలో రోగులకు 15 వీల్‌చైర్స్‌లను అందచేశారు.ఈకార్యక్రమంలో సేల్స్‌ట్యాక్స్ కమీషనర్ రావులశశిధర్, పోలీసు అకాడమీ డిప్యూటి డైరెక్టర్ రావుల గిరిధర్, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్,బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ గురుస్వామి,ప్రధాన కార్యదర్శి విజయ్‌బాస్కర్‌రావు,కోశాధికారి మేడిశెట్టి రాకేష్,కాలే అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



దీక్ష లో పాల్గొన్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

ధర్నాచౌక్, నవంబర్ 29, ప్రభాతవార్త: నాయీ బ్రాహ్మణుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణ (మంగళి) ఆత్మ గౌరవ దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేసించి బాలకృష్ణ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలక మండలి ఏర్పాటుచేయాలని, బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మంగళ వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని, కళ్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రాకేష్ చేర్యాల మాట్లాడుతూ మంగళి వృత్తిని వేరే కులస్థులు చేసేందుకు అనుమతి తిరస్కరించాలన్నారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షా కార్యక్రమంలో వాయిద్య కారుల సంఘం నాయకులు ఎల్.వి.చెన్నారావు, గంగపుత్ర రాష్ట్ర నాయకులు పూస సత్యం, మేరు సంఘం నాయకులు వీరప్ప, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు రేణుక, శ్రీనివాస్, అనంత దుర్గా ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ధర్నాచౌక్, నవంబర్ 29, ప్రభాతవార్త: సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని ముషీరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 18 వ తేదీ మధ్యాహ్నాం కవాడిగూడకు చెందిన ఒక విద్యార్థిని ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనం పై వచ్చి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా రాజేంద్రనగర్‌లో నివసించే షేక్ అల్తాఫ్ (22) సెల్‌ఫోన్ దొంగిలించినట్లు నిర్ధారణకు రావటంతో మంగళవారం అల్తాఫ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌ల దొంగతనాలకు సంబంధించి, అల్తాఫ్‌పై కేసులు నమోదయ్యాయని, అరెస్ట్ అయిన అల్తాఫ్ వద్ద నుండి రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

## ఒయూలో ఘనంగా దీక్షాదివాస్




ఒ.యూలో దీక్షాదివస్ కేక్‌ను కట్‌చేస్తున్న టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్

తార్నాక, నవంబర్ 29 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీలో దీక్షదివస్ కార్యక్రమాన్ని టీఆర్ఎస్వీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పలువురు టీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నవంబర్ 29న రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను పణంగా పెడితే సబ్బండ ప్రజానీకం తరలివచ్చిన చారిత్రక రోజు అన్నారు. సీఎం కేసీఆర్ దీక్షతోనే కేంద్రం పార్లమెంట్‌లో బిల్లుపెట్టే స్థాయిలో ఆదీక్ష కొనసాగిందన్నారు.నేడు సీఎం కేసీఆర్ అన్ని జిల్లాలకు, సబ్బండ కులాలను సమానంగా చేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వీ నాయకులు కడారి స్వామి, కోతి విజయ్, రఘురాం, శివ వెంకటేష్ గౌడ్, దశరథ్, కరుణాకర్ రెడ్డి, కృష్ణ, జంగయ్య, సతీష్, నవీన్ గౌడ్, వేల్పుకొండ వెంకటేష్, మేకల రవి, సుధీర్‌కుమార్, శోభన్‌బాబు, బొల్లు నాగరాజ్, నాగారం ప్రశాంత్, రమేష్ గౌడ్,భాస్కర్ మిథున్ ప్రసాద్, నాగేందర్ రాజు, రామక్రిష్ణ,శ్రీనునాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అధికార పార్టీ నాయకుల ఆగడాలను సాగనీయం

నిజాంపేట్, నవంబర్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి సర్వేనెంబర్ 253, బంధం చెరువు శిఖంలో హెచ్ఎండీఏ, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని బిజెపి నాయకులు మండిపడ్డారు.అధికార పార్టీ నాయకుడి అండదండలతో భారీ భవన నిర్మాణాన్ని అక్రమంగా నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు సిబ్బంది చర్యలు తీసుకోకపోగా ప్రత్యక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. రాజీవ్‌గాంధీనగర్‌లో ఒక వ్యక్తి సెట్‌బ్యాక్ రోడ్డుపైకి వచ్చిందని తెలియడంతో కూల్చివేసిన అధికారులు అధికార పార్టీ నాయకుడి సహకారంతో అక్రమంగా నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇప్పటికైనా హెచ్ఎండీఏ, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు శిఖంలో నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని అడ్డుకొని కూల్చివేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## నిరుద్యోగభృతి చెల్లించాలని బిజెవైఎం నాయకుల వినతి

ఘట్‌కేసర్, నవంబర్ 29, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానం మేరకు నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించాలని బిజెవైఎం రాష్ట్ర ఆర్థిక సలహాదారు చిత్రంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగభృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఘట్‌కేసర్ తహాశీల్దార్ విజయలక్ష్మిని కలసి వినతిపత్ర ం అందజేశారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్ పిలుపుమేరకు బిజెవైఎం నాయకులు తహాసీల్ కార్యాలయం ముందు కొద్ది సేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిసరన తెలిపారు. ఎంతోమంది అమరవీరులు ఆత్మబలిదానాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు వస్తాయని యువతీ, యువకులు ఎదురుచూస్తున్నారని సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు భృతి ఇస్తామని ప్రకటించి అమలు చేయడంలో విఫలమయ్యారని చిత్రంజన్‌రెడ్డి విమర్శించారు.

## నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే ఇవ్వాలి: బిజెవైఎం



ఎమ్మార్వోకి వినతిపత్రాన్ని అందజేస్తున్న బిజెపి నాయకులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 29, ప్రభాతవార్త : యువమోర్చా రాష్ట్ర శాఖ ఇచ్చినటువంటి పిలుపులో భాగంగా రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగులు అందరికీ నిరుద్యోగ భృతి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి అసెంబ్లీల బిజెవైఎం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఎమ్మార్వోకి బిజెపి నాయకులు వినతిపత్రాన్ని మంగళవారం అందజేవారు. ఈ కార్యక్రమానికి హాజరైన బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, బిజెవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులందరికీ తక్షణమే 48 గంటల్లో 48 నెలల నిరుద్యోగ భృతిని అందించాలని డిమాండ్ చేస్తున్నామని లేని పక్షంలో భారతీయ జనతా యుమోర్చా ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మాయ మాటలు చెప్పిన కెసిఆర్ ప్రభుత్వం యువతను మోసం చేసి ఎన్నికల్లో గెలవడం కోసం ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగ భృతి రాక రా ష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నదన్నారు. యువ మోర్చా పోరాటాల ఫలితంగా ఇచ్చినటువంటి ఉద్యోగ నోటిఫికేషన్ లో ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా కాలయాపన ఎందుకు చేస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత ఉన్నటువంటి యువత టిఆర్ఎస్ పార్టీని బొందపెట్టి భారతీయ జనతా పార్టీకి సంపూర్ణ మద్దతిచ్చి గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా నాయకులు పృథ్వీ, వినోద్, శివాజీ, అసెంబ్లీ కన్వీనర్లు రామకృష్ణ, సాయి, డివిజన్ అధ్యక్షులు రాహుల్, సతీష్, కిరణ్, సంతోష్, సాహేత్, రాజేందర్ పాల్గొన్నారు.

## రెండవ రోజుకు చేరిన బిజెపి నాయకుల నిరవధిక దీక్ష



నిరవధిక దీక్షలో బిజెపి నాయకులు

దుండిగల్, నవంబర్ 29 ప్రభాతవార్త: గండిమైసమ్మ దుండిగల్ మండల కార్యాలయం ఎదుట మల్లంపేట్ బిజెపి నాయకుల నిరవధిక దీక్ష రెండవ రోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కోశాధికారి పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట గ్రామంలో 170 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో శ్రీలక్ష్మీ శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్ వారు నిర్మిస్తున్న ఎఫ్‌టిఎల్ బఫర్‌జోన్‌పరిధి 50 విల్లాలను తొలగించి ప్రభుత్వ భూమిని, చెరువును కాపాడాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఎమ్మార్వో, కలెక్టర్‌కు పలు మార్లు వినతి పత్రం అందించామని, కలెక్టర్ ఈ స్థలంపై ఎంక్వైరీ చేయించి ఇవి అక్రమ నిర్మాణాలేనని గుర్తించి వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అదే విధంగా శ్రీలక్ష్మీ శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్ బిల్డర్‌పై కేసు నమోదు చేయడంతో క్రింది స్థాయి అధికారులు అధికారపార్టీ నాయకులతో కుమ్మక్కై తూతూ మంత్రంగా విధులు నిర్వహించి వాటిని కూల్చివేశామని పై అధికారులను మభ్యపెట్టారు. గతంలో సీజ్ చేసి కూల్చివేసిన నిర్మాణాలను మరలా నిర్మించారని, ఒక పేద వాడు పట్టాభూమిలో గుడిసెవేసుకుంటే వారిని భయభ్రాంతులకు గురిచేసి కూల్చివేస్తారు. కానీ అధికార పార్టీ అండ దండలతో కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా క్రింది స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికి సహకరించి చెరువులు, ప్రభుత్వ భూములను మింగేస్తున్నారు. కలెక్టర్ దీనిపై పర్యవేక్షించి ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలతో వీరికి సహకరించిన క్రింది స్థాయి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సతీష్,మురళి,నర్సింగ్, మున్సిపల్ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, యువమోర్చా ఆకుల విజయ్, శ్రీనివాస్ యాదవ్, హనుమంతు, రాహుల్, నవీన్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా స్వచ్ఛంధ సంస్థ

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 29, ప్రభాతవార్త : టీమ్ కేర్ అండ్ షేర్ ఫౌండేషన్ 200 డొనేషన్ విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రక్కన జీవిస్తున్నటువంటి అనాధలకు, నిరాశ్రయులకు ఆసరా కల్పించే ముఖ్య ఉద్దేశ్యంతో వారందరినీ ఒక దగ్గరికి చేర్చి ఆహారం, బట్టలు అందజేసి వారిని అనాధాశ్రమంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీత హాజరై టీమ్ కేర్ అండ్ షేర్ ఫౌండేషన్ సభ్యులు చేసినటువంటి సేవా కార్యక్రమాలను చూసి అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇకముందు మరెన్నో చేయాలని దానికి తన సహాయ సహకారాలు తప్పనిసరిగా అందజేస్తానని కార్పొరేటర్ హామి ఇచ్చారు. అదేవిధంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ సురేష్ మాట్లాడుతూ ఒక్కరోజు అన్నం బట్టలు ఇస్తే ఒక్క ఆరోజు మాత్రమే కడుపు నింపినవాళ్ళమువతామని కానీ వారి సమస్యలు తెలుసుకుని వారు బ్రతకడానికి ఆశ్రయం కల్పిస్తే వారు జీవితాంతం సంతోషంగా బతకడానికి కృషి చేసినవాళ్ళం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో శాలిని, రాజు, అఖిల్, రాధా, నరేష్, జీవన్, సురేష్, ప్రభాస్, నిఖిల్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విజయ గణపతి ఆలయంలో పూజలు



విజయగణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

బేగంపేట నవంబరు 29,ప్రభాతవార్త : బేగం పేట శ్యాంలాల్ బిల్డింగ్ చౌరస్తాలోని శ్రీ విజయ గణపతి ఆలయం చౌరస్తా లో ముందుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పొన్న బోయిన సురేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనం తరం మాధవరం గణపతి ఆలయంలో పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న పూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు, దేవాలయ వ్యవస్థాపకులు మోత్కూరు శ్రీధర్ శర్మ,కమిటీ అధ్యక్షులు రాకేష్ (రాజు),ప్రధాన కార్యదర్శి యాదగిరి,విసి,సెక్రటరీ సత్యనారాయణ,జాయింట్ సెక్రటరీ మోహన్,ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కిశోర్‌కుమార్, ఎన్.వినోద్,ప్రవీణ్,కె.యం.రాజు,ప్రవీణ్,జగదీష్, మారుతి, రవి, అశోక్,సురేష్, రామ్మోహన్‌లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని సత్కరించారు. అనంతరం తీర్ద ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో బిజెపి నాయకుడు భరతసింహారెడ్డి

పేట్‌బషీరాబాద్, నవంబర్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామంలో రోడ్డు,వాటర్‌పైపులైన్ సమస్యలపై మంగళవారం బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి పర్యటించి ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరత్‌సింహారెడ్డి మాట్లాడుతూ జీడిమెట్ల గ్రామంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం స్థానికులు రోడ్డు, వాటర్‌పైపులైన్ సమస్యలతో ఇబ్బందిపడుతుండడంతో అధికారులతో ఫోన్‌లో సంభాషిం చి సమస్యలను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశాడు.

## ఆత్మీయ సన్మానసభను జయప్రదం చేయాలి

ఘట్‌కేసర్, నవంబర్ 29, ప్రభాతవార్త: రాజ్యసభసభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆత్మీయ సన్మానసభను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం లక్ష్మణ్ ఆత్మీయసన్మానసభ కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. డిసెంబర్ 4న ఘట్‌కేసర్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు-బిజెపి ఓబిసి మోర్చ జాతీయ అధ్యక్షులు, పార్లమెంటరీబోర్డుకమిటీ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఆత్మీయ సన్మానసభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు రాజకీయాలకు అతీతంగా జరిగే లక్ష్మణ్ సన్మానసభకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పట్టణప్రజలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని నేతలు కోరారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

# సుబ్రమణ్యా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 29, ప్రభాతవార్త : సుబ్రమణ్యషష్టి సందర్భంగా మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అమీర్‌పేట డివిజన్ గురుమూర్తి నగర్‌లో గల గణేష్ దేవాలయంలోని సుబ్రమణ్యం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వమించారు. పూజల అనంతరం మంత్రిని ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిపై దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ కృష్ణ, ఈఓ నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారిలతో సమీక్షించారు. ఆలయం వెనుకవైపు ఉన్న స్థలంలో కిచెన్, ఆఫీస్‌రూమ్, టాయిలెట్స్ నిర్మాణం, ఆలయ ఆవరణలో ఫ్లోరింగ్ పనులు వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని, ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామి ఇచ్చారు.

**నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ చేపడతాం : మంత్రి తలసాని**

అమీర్‌పట్ డివిజన్‌లోని గురుమూర్తి నగర్, ఎస్‌ఆర్‌టి క్వార్టర్స్‌లలో నూతనంగా డ్రైనేజి పైప్‌లేన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రకటించారు. మంగళవారం ఆయన గురుమూర్తి నగర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజి లైన్ ఎన్నో సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించడం జరిగిందని, ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా లేకపోవడం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. పాతలైన్‌ను తొలగించి నూతనంగా పెద్దసైజ్ పైప్‌లైన్‌కు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రైనేజితో పాటు అవసరమైన ప్రాంతాలలో మంచినీటి పైప్‌లైన్‌ల ఏర్పాటు అనంతరం రోడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందుకు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేసి అందజేయాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక కాలనీ ప్రజలు కొందరు తమకు ఒక బోర్‌వెల్ కావాలని కోరగా, ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంల ఓ జోనల్ కమీషనర్ రవికిరణ్, డిసి మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జిఎం హరి శంకర్, ఎఎంఓహెచ్ భార్గవ్, కాలనీ వాసులు బ్యాంక్ శ్రీనివాస్, విఠల్‌నారాయణ, పవన్‌సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

## జీపీ లేఔట్లలో స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని ధర్నా

ఘట్‌కేసర్, నవంబర్ 29, ప్రభాతవార్త: గ్రామపంచాయతీ పరిధిలోని లేఔట్లలో స్థలాలను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ రియల్టర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నర్సయ్య డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు మంగళవారం రియల్టర్ల అసోసియేషన్ మండల అధ్యక్షులు వేముల గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఎస్ఆర్ఓ ముందు నిరసన ర్యాలీ జరిపి రియల్టర్లు నినాదాలు చేశారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య హాజరై మాట్లాడుతూ 2020 సంవత్సరంలో నిలిపివేసిన గ్రామపంచాయతీ లేఔట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషను చేయాలన్నారు. ఈసమస్య పరిష్కారం కోసం రియల్టర్లతో పాటు వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన స్థలాల యాజమానులు కూడా ముందకు వచ్చి ఆందోళన చేయాలని పిలుపు నిచ్చారు. జీపీ వెంచర్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోయిందని యువతకు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

## ఎం.ఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ కార్యవర్గానికి ఎన్నికలు



కార్యవర్గంతో తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు

అప్జల్‌గంజ్, నవంబర్ 29 ప్రభాతవార్త డాక్టర్‌ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆదేశాల మేరకు అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్ రాజ్‌కుమార్,కె.శ్రీనివాస్ ఆద్వర్యంలో ఎం.ఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలుగా అరుణజ్యోతి,కార్యదర్శి బి.శివకుమార్,కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా జగన్నాథం, సంయుక్త కార్యదర్శిగా సుకేశిని, అమృతమ్మ, వాసవి, నాగరాజు, మేరి, జి.బి.పవన్‌కుమార్, శ్రీనివాస్, శ్రీరామలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ, కార్యదర్శి విక్రమ్‌కుమార్‌లు నియామక పత్రాలను అందచేశారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నెం.45, పని పేరు: GHMC, రాజేంద్రనగర్ సర్కిల్-11 యందు స్కేటింగ్ ట్రాక్ 1 నెం. పని, అంచనా విలువ: ECV: రూ.21.60 లక్షలు, డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది మరియు సమయము: 29.11.2022న మ.2.30 గం.లు, బిడ్ స్వీకరణకు చివరి తేది మరియు సమయము: 02.12.2022న మ.2.45 గం.లు, EE/SE పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, రాజేంద్రనగర్ డివిజను నెం.11, GHMC, సెల్ నం.9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజను-XI (RJNR), GHMC
DIPR.No.9559-PP/CL/Advt/1/2022-23, తేది: 29.11.2022

**IN THE COURT OF HON'BLE MACT CUM XI ADDL DIST JUDGE, R.R.DIST: AT : L.B.NAGAR**
**O.P. No. 338 of 2017**

Between:-
**K. Nandhini,** Represented by her father K. Laxman ...**Petitioner**
AND
**B. Kumar and others** ...**Respondents**

To,
**M. Nagaraju S/o Lingaiah,** Aged about 40 years, Occ: Business, R/o H.No.1-3, Reddipally, Peddachintakunta, Narsapur, Medak District-502313
**(Respondent-No.3)**

Whereas, K. Nandhini, have instituted the above claim against you for compensation. You are hereby summoned to appear before this Hon'ble Court by person or through an Advocate on Dated: **14.12.2022,** at 10.30 a.m. to answer the same, failing which the case will be disposed off exparte.

(BY THE ORDER OF HON'BLE COURT)

**Sd/- M. GOVERDHAN RAO, P. SANGAMESHWAR, Advocates**
106, B-Block, Prajay Alkapuri Apartment, Green Hills Colony, R.R.Dist

**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT UPPAL AT L.B.NAGAR**
**O. S. No.2029 of 2022**

Between:
**Ravuri Phani Kumar & another.** ...**Plaintiffs**
And
**1. The Tahsildar,** Ghatkesar Revenue Mandal, Medchal-Malkajgiri District.
**2. All Concerned.** ...**Defendants**

To
**1. The Tahsildar,** Ghatkesar Revenue Mandal, Medchal-Malkajgiri District.
2. All Concerned

**NOTICE**

Please take notice that the plaintiffs have filed the above suit for declaration to declare the plaintiffs as the legal heirs of late Sri Ravuri Sree Ramachandra Murthy S/o. late Sri Ravuri Seshagiri Rao in respect of the suit schedule property before the Hon'ble I Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri Dist. Uppal At L.B.Nagar. The matter is posted to 16-12-2022 at 10.30 A.M. for your appearance either in person or through counsel, failing which the matter will be decided as per law.

**SCHEDULE PROPERTY**

All that part and parcel of land admeasuring 300 square yards equivalent to 250.8 square meters bearing plot number 122 covered by survey number 732, situated at Korremul Village, Ghatkesar Mandal, Ranga Reddy District under S.R.O Uppal bounded by:- North: Plot No.121; South: Plot No.123, East: 40' wide Road; West: Plot No.137.

(BY ORDER OF THE COURT)

**Sd/- K. Ashok Reddy, Advocate**
F.No.103 at 3-4-543 & 544, Lakshmi Nilayam, Narayanaguda, Hyderabad-500027, **Cell 9440623917**

# నక్క అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

## అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని వినతి

## ఇబ్రహీంపట్నం ఆర్డిఓకు విచారణకు ఆదేశించిన కలెక్టర్



వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు గ్రామం జర్నలిస్టు కాలనీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ భర్త నక్క శ్రీనివాస్‌గౌడ్‌పై జర్నలిస్టులు మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామం లోని సర్వేనెంబర్ 38లో జర్నలిస్టులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వగా ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న నక్క శ్రీనివాస్‌గౌడ్ తన భార్య సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకొని గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 38లో ఉన్న ప్రభుత్వ స్థలాల ను ఆక్రమించుకొని నిర్మాణాలుజరిపాడని జర్నలిస్టులు కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని అక్రమం గా ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు వాణిజ్య భవనా లు నిర్మించాడని ఆయా భవనాలను కూల్చివేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరిపిన విషయా న్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మునగనూరు గ్రామంలో వేలాది గజాల స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరిపా డని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతటితో శ్రీనివాస్‌గౌడ్ ఆగ డాలు ఆగలేదని జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ స్థలా న్ని కూడా ఆక్రమించేందుకు రౌడీయిజం చేస్తూ జర్నలిస్టులపై భౌతికదాడులకు పాల్పడుతున్న శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై విచార ణచేపట్టి స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన విషయమై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డిఓకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్, అబ్దుల్లాపూర్‌మెట్ తహసిల్దార్ అనితారెడ్డిలకు శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు జరిపిన వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

## మంత్రి సబితారెడ్డి చొరవతోనే కుంటల సుందరీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న సంరెడ్డి వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి చొరవతోనే బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ పోచమ్మకుంట, కోమటికుంట లు సుందరీకరణకు నోచుకుంటున్నాయని మాజీ ఎంపిటిసి, సీనియర్ టిఆర్‌ఎస్ నాయకుడు సంరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. కుంటల సుందరీకరణ కోసం హెచ్ఎండిఏ ద్వారా రూ.4.50 కోట్లను మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంజూరు చేయించిన సందర్భంగా మంగళవారం స్థానిక వర్షిణి ఫంక్షన్ హాల్‌లో సుమారు 15 కాలనీల సంక్షేమ సంఘాల నాయకుల తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రికి ప్రజలతరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భం గా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో రాజకీయాలు, పార్టీలకతీతంగా ప్రజా సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత కేవలం సబితారెడ్డికే దక్కు తుందన్నారు. గతంలోనూ ఆమె అల్మాస్‌గూడ అభివృద్ధికి సహకరించారనీ ప్రస్తుతం స్థానిక కుంటల సుందరీకరణ కోసం రూ.4.50కోట్లను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. ఈ నిధులతో చేపట్టే సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు కుంటల కట్టలపై పిల్లల పార్కు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు కానున్నాయని ఆయన వివరించారు. కుంట ల సుందరీకరణ వల్ల దాదాపు 50 కాలనీల ప్రజలతో పాటు అల్మాస్‌గూడ పాతగ్రామం ప్రజలకు చక్కనిఆహ్లాదం లభిస్తుం దని ఆయన తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్న మంత్రికి వెంకట్‌రెడ్డితో పాటు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బోయపల్లి ఎన్‌క్లేవ్, మధురాపురి, న్యూ మధురాపురి, అమరావతి కాలనీ, షిర్డీనగర్, కాకతీయనగర్, శేషాద్రినగర్, సౌభాగ్యలక్ష్మినగర్, వెంకటేశ్వర నగర్, కెఆర్‌ఆర్ కాలనీ, రామిడిహిల్స్, విశాఖనగర్, బిఆర్‌ఆర్ కాలనీ సంక్షేమ సంఘాలకు చెందిన సంపెల్లి మహేందర్‌రావు, అంజల్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, నల్ల రాజేష్, మధుసూదన్‌రావు, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దేవానంద్, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో డ్రైనేజీ మరమ్మతులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త :** చాలాకాలంగా డ్రైనేజీ సమస్య వెంటాడుతున్నడంతో ఎమ్మెల్యే చొరవతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. చైతన్యపురి డివిజన్ వికాస్‌నగర్‌కాలనీ బ్యాంకులైన్‌లో చాలా కాలంగా డ్రైనేజీ లీకేజీలు ఏర్పడి ఆ ప్రాంతం పూర్తిగా దుర్గంధంగా మారింది. చాలాకాలంగా అవస్థలు పడుతున్నామని కాలనీ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పం దించిన ఎమ్మెల్యేవెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో చైత న్యపురి డివిజన్ తెరాస నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి సోమవా రం డ్రైనేజీ మరమ్మతు పనులను చేయించారు. కార్యక్రమం లో అధ్యక్షులు పుల్లారెడ్డి, తెరాస నాయకులు కృష్ణ, సంతోష్ యాదవ్, జలంధర్, పులి కిరణ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్..

**నేరెడ్‌మెట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** నేరెడ్‌మెట్ డివిజన్‌ను పూర్తిస్థాయిలో చేస్తానని కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌పరిధిలోని జెజెనగర్‌లో టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలసి భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్య మన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోసం నిరతంరం పాటు పడతానన్నారు. అంతేకాకుండా డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పను ల్లో ఎటువంటి జాప్యం, లోపం జరిగిన సంబంధిత కాంట్రా క్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, వాటర్‌వర్క్స్ డిజిఎం భాస్కర్, నాయకులు ఎస్సార్ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, శివ, మహేష్, రాజు, మదు సూధన్ రెడ్డి, కిశోర్, ధరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఇంఛార్జి చంద్రయ్య, ప్రిన్సిపల్ ప్రేమలత, విద్యార్థులు తదితరులు

**మలక్‌పేట, నవంబర్ 29 ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.శ్రీనాగేష్, రిటైర్డ్ ప్రిన్సిపల్ కె.బాలకృష్ణరెడ్డిలు పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ న్యూ నోబుల్ డిగ్రీ కాలేజ్ ఆరంభ్ - 2022 ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని పట్టుదల, అంకితభావంతో చదివితే ఉన్నత శిఖరాలను చేరు కోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంఛార్జి గౌని చంద్రయ్య, ప్రిన్సిపల్ ప్రేమలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లక్ష్మారెడ్డికాలనీలో అయ్యప్ప మహాపడిపూజ

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ లక్ష్మారెడ్డి కాలనీలో కాంగ్రెస్ పార్టీ నేత బిక్కుమళ్ల అంజయ్యగుప్త ఆధ్వ ర్యంలో అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన పూజ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మర ణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా అయ్యప్ప పూజలు నిర్వహించి స్వాములను పూజించుకోవడం అభినం దనీయమన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్య క్రమంలో ఉప్పల్ గ్రామ పెద్దలు దుబ్బ నరసింహారెడ్డి, సల్ల వీరారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, బిక్కుమళ్ల చంద్రుడు, లక్ష్మణ్, సంతోష్, రాఘవేందర్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి : లచ్చిరెడ్డి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, నవంబర్ 29 ప్రభాతవార్త :** బిఎన్ రెడ్డినగర్ డివిజన్‌లో పలు కాలనీలలో రోడ్లు,పార్కుల అభివృద్ధి, పార్కు స్థలాల కు ప్రహరీగోడలను నిర్మిం చడానికి నిధులుకేటాయిం చాలని డివిజన్ కార్పొరేట ర్ మొద్దు లచ్చిరెడ్డి జోనల్ కమిషనర్ పంకజకు విన తి పత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలోని శివారు కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే నిధులు మంజూరు చేయాలని జడ్సీకి వివరించారు. అందకు స్పందించిన అధికారి నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## పేద మైనారిటీ మహిళ చికిత్సకు మంత్రి సబితమ్మ సాయం

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** నిరుపేద మైనారిటీ కుటుంబానికి చెందిన మహిళ వైద్య చికిత్సకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి అండగా నిలిచి సిఎం సహాయనిధి నుండి రూ. 40,500 మంజూరు చేయించారు. బడంగ్ పేట్ కార్పొరే షన్ వెంకటాపూర్ చెందిన రెహనా బేగం తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరగా వైద్యఖర్చులు భరించలేని కుటుంబ సభ్యులు కార్పొరేటర్ జెనిగె భారతమ్మ కొమురయ్యయాదవ్ సహకారంతో మంత్రి సబితారెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్ మంజూ రు చేయించి చెక్కును అందజేశారు.

## బాలాపూర్‌లో బస్తీ దవాఖానా ప్రారంభం

**సరూర్‌నగర్, ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌కార్పొరేషన్‌లోని 17వ డివిజన్ బాలాపూర్‌లో బస్తీదవాఖాను మంత్రి సబితారెడ్డి ప్రారంభించారు. మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్ వంగేటి ప్రభా కర్‌రెడ్డి తదితరులతో కలిసి బస్తీ దవాఖానాను ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ గీతకుమారి, జిల్లాబస్తీ దవాఖానాల ఇంఛార్జి వినోద్‌కుమార్, బాలాపూర్ యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శారద, కార్పొరేటర్లు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఏనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త :** నాగోల్ డివిజన్ పరిధిలోని ఫతుల్లగూడలోని ఏనిమల్ కేర్ సెంటర్ ప్రాంగ ణంలో తెలుగురాష్ట్రాలలో మొదటి జంతు స్మశానవాటిక త్వ రలో అందుబాటులోకి రావడం జరుగుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని ఫతుల్లగూడలోని ఏనిమల్ కేర్ సెంటర్‌ను మంగ ళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీపుల్స్ ఫర్ ఏనిమల్ స్వచ్ఛంద సంస్థ వారు ముందుకువచ్చి దాదాపు కోటిరూపాయలు ఖర్చుతో ఎనిమల్ కేర్‌సెంటర్ ఏర్పాటు చేశారని తెలిపారు. జంతువుల దహనం కోసం నూతన పరికరాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంట్లో పెంచుకునే జంతువులు అనారోగ్యంతో మరణిస్తే జం తు స్మశానవాటిక వారిని సంప్రదిస్తే నామమాత్రపు ఛార్జిలతో అంతిమ సంస్కారం చేస్తారన్నారు. రోడ్ల వెంబడి రోజుకు వందల సంఖ్యలో జంతువులు మరణించడం జరుగుతుందని వాటిని పక్కకు పడేయడం వల్ల పరిసర ప్రాంతాలు దుర్గమ్మ మారుతున్నాయని తెలిపారు. వాటిని కూడా స్మశాన వాటిక లో ఖననం చేయడం జరుగుతుందన్నారు. పీపుల్స్ ఫర్ ఎని మల్ సంస్థ సభ్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, పీపుల్స్ ఫర్ ఏనిమల్ సంస్థ ఫౌండర్ అధ్యక్షులు వసంతి, డాక్టర్.రమణారావు, డాక్టర్ అమూల్య, శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే బలాల



ఎమ్మెల్యే బలాల, షఫీలను సన్మానిస్తున్న శ్రీనివాస్

**మలక్‌పేట, నవంబర్ 29 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని మున్సిపల్‌కాలనీలో రూ.52లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే బలాల, డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీలతో కలిసి ప్రారంభించారు. అనం తరం పలు కాలనీలలో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి సమస్యల తెలుసుకున్నారు. వెంటనే ప్రజలు పేర్కొన్న సమ స్యల గురించి అధికారులో చర్చించి తగిన చర్యలు చేపడ తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యుడు శ్రీనివాస్, సాయిబాబా దేవాలయ ఛైర్మన్ వేమూరి రాంకోటేశ్వరరావు, నక్క అమరేందర్‌గౌడ్, సురేందర్‌సింగ్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల 2వ అంతస్తుపై ఐరన్ గ్రిల్ ఏర్పాటు



ఐరన్ గ్రిల్‌ను ప్రారంభిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

**వనస్థలిపురం, నవంబర్ 29 ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని జడ్‌పిపి హైస్కూల్ భవనంలో 2వ అంతస్తుకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్‌ను వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ ప్రెసిడెంట్ విఎన్ గోల్డెన్‌స్టార్ కెసిజిఎఫ్ పాత సుదర్శన్ చేతులమీదుగా మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వాసవి క్లబ్ సామాజిక సేవలో ముందజలో ఉండి ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. చిన్న పిల్లలకు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ విట్టా దూరయ్య, మర్యాల చౌందమౌళిగుప్త, ఆలేటి రవికుమార్, నీలా విజయలక్ష్మి, అత్తులూరి మల్లికా ర్జున్, విట్టా సాయిమోహన్, గాంధీ, అల్లాడి పరమేశ్వర్, నరసింహులు, వనస్థలిపురం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, శివనాగేశ్వరరావు, రాజేందర్, సత్యవాణి పాల్గొన్నారు.

## విద్యార్థులలో దాగి వున్న కలలను వెలికి తీయాలి : మార్కండేయులు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**కుషాయిగూడ, నవంబర్ 29 ప్రభాతవార్త :** విద్యార్థులలో దాగి ఉన్న కళాఖండాలను నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఉపాధ్యాయులపాత్ర ఎంతో కీలకమని భాష్యం విద్యాసంస్థల హైదరాబాద్ జోనల్ ఇన్చార్జి మార్కండేయులు పేర్కొన్నారు. కాప్రా పరిధిలోని ఏ.ఎస్.రావునగర్, ఈసీఐఎల్ బ్రాంచ్ లకు చెందిన భాష్యం విద్యాసంస్థల విద్యార్థినీ విద్యార్థులకు సాం స్కృతిక నృత్య పోటీలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో విద్యార్థినులు విద్యార్థులు అద్భుతమైన కళాకృత్యాలను ప్రద ర్శించారు. ప్రముఖ డాన్స్ మాస్టర్, డి ఫైనలిస్ట్ కాంటెస్టెడ్ సాయితేజ ముఖ్యఅతిథిగా విచ్చేసి జడ్జిగా కళాకారులను ఎం పిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఒక్కో రకమైన కళాఖండం దాగి ఉంటుందన్నారు. వాటిని బయటకు తీయ దానికి తాము విద్యతోపాటు సాంస్కృతికపరమైన పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అమరేశ్వరరావు, డాన్స్ మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలు కోరుకున్న విధంగా అభివృద్ధి : మంత్రి సబితారెడ్డి



మంత్రి సమక్షంలో తన డివిజన్‌లో కృష్ణానీటి సరఫరాను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా వారు కోరుకునే అభివృద్ధికి చేసి చూపెడుతు న్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కిందకు వచ్చే 15,16,17 డివిజన్లలో రూ.2.39 కోట్లతో చేపట్టిన సిసి రోడ్డు, వాటర్ పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీ, బిటి, సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ప్రాతినిధ్యం వహిస్తున్న బాలాపూర్ 15వ డివిజన్‌లో కృష్ణానీటి సరఫరాను ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధే ఎజెండాగా చేసుకొని పని చేస్తున్నామని వెల్లడించారు. మహేశ్వరం నియోజకవర్గంలో విస్తరిస్తున్న కాలనీల్లో జనాభా అవసరాలకు అనుగుణంగా మౌళిక సదుపాయాలను కలిస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సిఎం కెసిఆర్ సార థ్యంలోని ప్రభుత్వం చేతల ప్రభుత్వమని నిరూపిస్తున్నామని సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ చిగి రింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, డివిజన్ల కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరిజైహింద్‌కుమార్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘు నందనచారి, బండ్లగూడ ఖాల్సా వైస్ ఛైర్మన్ కొలన్ తిరుపతి రెడ్డి, గ్రామ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మని గిరీష్‌లతో పాటు వివిధ వార్డుల కార్పొరేటర్లు నేనావత్ బాలు నాయక్, బండారి మనో హర్, జెనిగె భారతమ్మ కొమురయ్య యాదవ్, సూర్ణగంటి అర్జున్, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు జెనిగె శ్రీనివాస్ యాదవ్, లిక్కి కృష్ణారెడ్డి, ఇఎల్‌వి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఐవిఎఫ్ రూ. లక్ష వితరణ



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న మంత్రి కేటీఆర్ ఛైర్మన్ ఉప్పల

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త :** ఇంటర్‌నేషనల్ వైశ్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ సంస్థ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సమక్షం లో మంత్రి కేటీఆర్ అచ్చంపేటకు చెందిన ఐఏఎస్ ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన జులూరి సందీప్‌కుమార్‌కు మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నందున లక్ష రుపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, ఛైర్మన్ శ్రీని వాస్‌గుప్తా విద్యార్థి సందీప్‌ను అభినందించారు. ఈ సంద ర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఐవిఎఫ్ అందిస్తున్న ప్రోత్సా హకాన్ని సద్వినియోగపరుచుకొని సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించలని,సమాజానికి మంచి పేరుతేవాలని సూచించారు. ఉప్పల మాట్లాడుతూ తెలంగాణలోని కాకుండా గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడ ప్రిలిమ్స్ పాసై, మెయిన్స్ రాసిన వాళ్ళకు 23మందికి ఐవిఎఫ్ చేయూతను అందించి దన్నారు. దేశవ్యాప్తంగా ఐవిఎఫ్ ఏడు సంవత్సరాల నుంచి తెలుగు రాష్ట్రాలలోని వైశ్య సామాజికవర్గంలోని మెయిన్స్‌కు ఎన్నికైన వాళ్ళు ఎంతమంది వున్న లక్ష రుపాయాల నగదు పురస్కారాన్ని ఒక్కొక్కరికి అందిస్తామని మంత్రి కెటిఆర్ సమక్షంలో ప్రకటించారు.

## దేవాలయ భూములను కాపాడండి : కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్




దేవాదాయ శాఖ కమిషనర్‌కు అనిల్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో దేవాల య భూములను కాపాడాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ మంగళవారం దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించా రు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీవాణి మాట్లా డుతూ శ్రీనగర్‌కాలనీ, శ్రీరామకాలనీ మధ్యలో ఉన్న దేవా దాయశాఖ భూమిలో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని, స్థలానికి హద్దులు లేకపోవడంతో కబ్జాకు గుర య్యే అవకాశముందన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో దేవాదాయ భూములకుహద్దులు ఏర్పాటుచేసి నిరుపయోగం గా ఉన్న భూములను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. దీనిపై దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తన బృందంతో త్వరలోనే సందర్శిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేరెడ్‌మెట్ వాయుపురి వద్ద యూ టర్న్ కొరకు ప్రతిపాదనలు

### పోలీసు, మున్సిపల్ అధికారుల పరిశీలన



వాయుపురిలోని యూటర్న్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ అదనపు డీసిపి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు..

**నేరెడ్‌మెట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** నేరెడ్‌మెట్ వాయు పురిదగ్గర వాహనదారుల సౌకర్యార్థం ప్రతిపాదించిన యూ టర్న్ స్థలాన్ని మంగళవారం ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గతంలోనే యూటర్న్ కొరకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ నుండి అనుమతి కోరినట్లు తెలిపారు. అనంతరం ట్రాఫిక్ అదనపు డీసిపి శ్రీనివాస్‌ను కలిసి యూటర్న్ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే అధికారులతో చర్చించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా సరైన నిబంధనలతో యూ టర్న్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్య క్రమంలో ఏసిపి శ్రీనివాస్ రావు, ఎస్ఈ అనిల్‌రాజ్, ఈఈ లక్ష్మణ్, సీఐ సుధీర్‌క్రిష్ణ, డీఇ మహేష్, ఏఈ సృజన, మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, చెన్నారెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ



అయ్యప్ప పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, నరసింహా తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ మహంకాళి ఆల యంవద్ద అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం మంగళ వారం వైభవంగా జరిగింది. మహంకాళి నరసింహా గురు స్వామిఆధ్వర్యంలో జరిగిన ఈ పూజ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, పలువురు నేతలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యప్ప నామ స్మరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్దలతో అయ్యప్ప పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అయ్యప్పస్వాములకు సహకారం అందిస్తామన్నారు. ఈ సం దర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప స్వాములు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం : రాగిడి లక్ష్మారెడ్డి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

**నాచారం,నవంబర్ 29 ప్రభాతవార్త:** మున్నూరు కాపు కుల స్థులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి, సమస్యలు పరిష్కారం అవుతాయని ఉప్పల్ నియోజక వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మున్నూరు కాపు సంఘం సభ్యులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికోసం తనవంతు సహకారామందిస్తానని చెప్పారు. నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మేడల మల్లికార్జున్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో మున్నూరుకాపుఅధ్యక్షులు తిప్పరి రాజబాబు, గౌరవాధ్యక్షులు తోట శ్రీనివాస్, జీఎస్ సుధాకర్ పటేల్, ఉపాధ్యక్షులు తోట రమేష్, కోషాదికారి శ్రీనివాస్, మహిళా గౌరవాధ్యక్షురాలు నిర్మల, అధ్యక్షురాలుగా తోట ప్రభావతి, జీఎం లీలావతి, యూత్ అధ్యక్షులుగా సాయి సాదినేని, యూత్ జీఎస్‌గా సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి



పార్కులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని జిఎ 2 కాలనీలో గల చిల్డ్రన్స్ పార్కులో చేపడు తున్న పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధి పనులు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, నవంబర్ 29 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివి జన్‌లో వేగవంతంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నా మని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని శాలివాహననగర్‌లో రూ. 6 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రణాళికబద్ధంగా పలుఅభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అభివృ ద్ధే ధ్యేయంగా పని చేస్తూ డివిజన్‌లో నిత్యం పాదయాత్రలు చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, నాయకులు మహేష్, దినేష్, శరత్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.